క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు సాయం


సాయం అందిస్తున్న సభ్యులు

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన గాడి లక్ష్మి, గొడ్డు చిన్న అమ్మాయిలకు చెందిన ఇళ్లు శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన విషయం తెలిసిందే. అయితే బాధితకుటుంబాలకు శనివారం స్థానిక వ్యవసాయ పరపతి పొదుపు సంఘం (మ్యాక్స్) అండగా నిలిచింది. ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి, సభ్యులు నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

20, 21 తేదీల్లో వ్యక్తిత్వ వికాస తరగతులు

భైంసాటౌన్: ఆనందిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, ఇంపాక్ట్ కార్యదర్శి వాడేకర్ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గౌరీ శంకర్ గార్డెన్, ముధోల్‌లోని బస్వ గార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు, యువత, పోటీ పరీక్షల అభ్యర్థులు, వ్యాపారులు, నిరుద్యోగులు పాల్గొనాలని సూచించారు. ఇంపాక్ట్ ఫౌండర్ గంప నాగేశ్వర్ రావు, ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు.

ట్రేడ్ పన్నులు చెల్లించాలి

నర్సాపూర్(జి): వ్యాపారులు ట్రేడ్ పన్నులను సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం పలు దుకాణాల్లో ట్రేడ్ పన్నులు వసూలు చేశారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులను విధిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. కారోబారి సట్ల శ్రీనివాస్ ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ పన్నెల జనార్దన్ సహకారంతో శనివారం మండలంలోని గోసంపల్లె గ్రామంలో 50 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు టేకు గంగారాం, అమంద శ్రీనివాస్, కరిపె రాజ్‌కుమార్, ధర్మరాజు, గాంది, ఎల్ఆర్ ఉపాలి తదితరులు ఉన్నారు.

రాయితీ బస్‌పాసుల పంపిణీ

కుంటాల: ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితంగా ఉంటుందని పంచాయతీ కార్యదర్శి రాజబాపు, ఆర్టీసీ సిబ్బంది బ్యాగరి శంకర్ పేర్కొన్నారు. నిర్మల్ డీఎం ప్రతిమారెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని రాజాపూర్, మెదన్ పూర్, కుంటాలలో దివ్యాంగులకు 50 శాతం రాయితీ బస్ పాస్‌లను పంపిణీ చేశారు.

'డబుల్' ఇళ్లలో కాలిన స్టార్టర్


కాలిన స్టార్టర్ పరిశీలిస్తున్న ఏఈ రాంసింగ్

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలోని బీ5 బ్లాక్‌లో శుక్రవారం రాత్రి విద్యుత్ ప్రమాదం చోటు చేసుకుంది. నీటిని సరఫరా చేసే త్రీ ఫేజ్ మోటార్ స్టార్టర్‌లో కండెన్సర్ బలహీనపడి లీక్ కావడంతో ప్యానెట్ బోర్డుతోపాటు కేబుల్ కాలిపోయింది. ప్రమాదంతో మంటలు లేవడంతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. అధికారులకు సమాచారం ఇచ్చి సరఫరా నిలిపివేయించారు. శనివారం ఏఈ రాంసింగ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సన్మానం


రహీమొద్దీన్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన రహీమొద్దీన్.. తపాలాశాఖల్లో 44 ఏళ్లపాటు విధులు నిర్వర్తించి శనివారం రిటైరయ్యారు. మండలకేంద్రంలోని పోస్టాఫీసులో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మెన్ ఎండీ రహీమొద్దీన్‌ను ఆ శాఖ ఉద్యోగులు శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఎస్‌పీఎం రవీందర్ మాట్లాడుతూ రహీమొద్దీన్ చేసిన సేవలను కొనియాడారు. బీపీఎంలు సుశీల్, సిద్ధి రాములు, విజయ్, మహేశ్, గణేశ్, నగేశ్, భూమేశ్ పాల్గొన్నారు.

గడువులోగా పూర్తి చేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశం


లింబా(కె)లో భూముల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

కుంటాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారుల గుర్తింపునకు చేపట్టిన సర్వే ఈనెల 20 గడువులోపు పూర్తిచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మండలంలోని లింబా(కె), కుంటాల గ్రామాల్లో సర్వే తీరును శనివారం పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందేలా చూడాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైనా వారి జాబితాను ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులతో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు చదివి వినిపించాలని కోరారు. లింబా(కె) గ్రామ శివారులోని ఆయా సర్వే నంబర్లలో రైతులకు సంబంధించిన పట్టా భూములను, అసైన్డ్, సాగుకు యోగ్యంగా లేని భూముల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

కాంట్రాక్టర్‌ను మార్చండి..

కుంటాల పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు రెండు రోజుల్లో పూర్తికాకుంటే సంబంధిత కాంట్రాక్టర్‌ను మార్చాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులు పూర్తి కాక ప్రసూతి గదిలో వైద్య సేవలు అందిస్తుండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మందుల నిల్వలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువు ముగిసిన మందులను సకాలంలో పంపించాలని కోరారు. ఆరోగ్య ఆయుష్మాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా కేంద్రాన్ని సందర్శించారు. యోగా నేర్పిస్తున్న పంచాయతీ కార్యదర్శిరాజ బాబును కలెక్టర్ అభినందించారు. పశు వైద్యశాల, గ్రంథాలయం పరిశీలించారు. ఆమె వెంట భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, డీపీవో శ్రీనివాస్, డీఏవో అంజిప్రసాద్, డీఎస్‌వో కిరణ్ కుమార్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీంఖాన్ వైద్యురాలు శృతి రెడ్డి, తదితరులు ఉన్నారు.

'జాయిన్ ఎన్ఎస్‌యూఐ' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నారాయణ్‌రావు, నేతలు

భైంసాటౌన్: పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీ ఆవరణలో జాయిన్ ఎన్ఎస్‌యూఐ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఎస్సీ సెల్ ముధోల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కాంబ్లే సాహెబ్ రావు, చాకేటి దేవన్న, జంగం శశిధర్, శశికుమార్, రాంరతన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే బాసర మండలం కిర్గుల్(బి)కి గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనకు రావాలని ఆహ్వానించారు.

లింబా(కె)లో సొసైటీ ఏర్పాటు చేయాలి


డీసీవోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కుంటాల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)ల పునర్విభజనలో భాగంగా మండలంలోని లింబా(కె) గ్రామంలో నూతన పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం గ్రామస్తులు నిర్మల్‌లోని తన కార్యాలయంలో డీసీవో పల్లె పాపారావుకు వినతిపత్రం అందజేశారు. కుంటాల పీఏసీఎస్ తమకు దూరం ఉండటంతో సకాలంలో ఎరువులు, విత్తనాలు అందడం లేదని వినతిపత్రంలో కోరారు. డీసీవో సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ సవ్వి అశోక్‌రెడ్డి, ఆనంద్‌రావు పటేల్, సత్యం గిరీశ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, గజ్జారాం, వీడీసీ చైర్మన్ ముత్యంరెడ్డి, గౌతమ్ ప్రమోద్, రాజు పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో లబ్ధిదారుల గుర్తింపు సర్వే


లక్ష్మణచాంద: కనకాపూర్‌లో రైతుభరోసా సర్వే చేస్తున్న అధికారులు


కడెం: పెద్దూర్ శివారులో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్


ఖానాపూర్ మండలం దిలావార్‌పూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో రత్నాకర్‌రావు


భైంసారూరల్: వాసల్‌పాడ్‌లో సర్వే చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, అధికారులు


సోన్ : కడ్తాల్‌లో సర్వే చేస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంతోపాటు మండలంలోని కనకాపూర్ గ్రామాల్లో శనివారం రైతుభరోసా సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా అధికారుల బృందం సాగు చేస్తున్న భూముల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో డీటీ అబ్దుల్ అజీజ్, ఏఈవో పవిత్ర, రెవెన్యూ సిబ్బంది మహేందర్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలో 20 నుంచి గ్రామసభలు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 20 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం పొట్టపెల్లి(కే), రాచాపూర్, చామన్‌పెల్లి, బోరిగాం, బాబాపూర్ గ్రామాల్లో, ఈనెల 21న మంగళవారం చింతల్‌చాంద, ధర్మారం, లక్ష్మణచాంద, కనకాపూర్, వడ్యాల్‌తండా, తిర్పెల్లి గ్రామాల్లో ఈనెల 22న బుధవారం మల్లాపూర్, నర్సాపూర్, న్యూకంజర్, పార్‌పెల్లి, మునిపెల్లి గ్రామాల్లో 23న గురువారం పీచర, వడ్యాల్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సభల్లో పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

ఖానాపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో రత్నాకర్ రావు అన్నారు. శనివారం మండలంలోని సింగాపూర్, దిలావర్‌పూర్ గ్రామాల్లో జరిగిన రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారుల గుర్తింపు సర్వేను పరిశీలించారు. గ్రామాల పంచాయతీ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కడెం: అర్హులను ఎంపిక చేసేందుకు భూముల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దూర్, పెద్దూర్‌తండాలో నిర్వహిస్తున్న వ్యవసాయ భూముల సర్వేను పరిశీలించారు. అనంతరం కొత్తరేషన్‌కార్డుల జారీకి సంబంధించిన సర్వే పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఎంపీవో కవిరాజు, ఏవో దినేశ్ తదితరులున్నారు.

సోన్: మండలంలోని కడ్తాల్, సాకేర గ్రామాలలో శనివారం రైతుభరోసా సర్వే నిర్వహించినట్లు ఆర్ఐ రఫీక్ తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు ఏవో వినోద్‌కుమార్, ఏఈఓలు ఉమామహేశ్వరి, ప్రగతి, సర్వేయర్ శ్రీనివాస్, ఎంపీఓ ఖలీల్ హైమద్, కార్యదర్శులు సుమయ్యద్ తస్కిన్, షేక్ ఖాజామొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని వాసల్‌పాడ్‌లో జరుగుతున్న రైతుభరోసా సర్వేను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హులను గుర్తించేందుకు వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏఓ గణేశ్, ఏఈఓ లక్ష్మి, ఆర్ఐ కృష్ణాగౌడ్, పంచాయతీ కార్యదర్శి గాయత్రి తదితరులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన కాలగిరి లక్ష్మి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. నాయకులు నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, భూమేశ్వర్, లింగన్న తదితరులు ఉన్నారు.

కడెం: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన సాదు రాజేందర్ కుటుంబాన్ని శనివారం జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, బరుపటి రమేశ్ పరామర్శించారు. నాయకులు శ్రీనివాస్, కన్నె శ్రీనివాస్, రాజేశ్వర్, సురేశ్ తదితరులున్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండా గ్రామానికి చెందిన జాదవ్ శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం బాధిత కుటుంబసభ్యులను సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ పరామర్శించారు. ఫౌండేషన్ తరఫున 50 కిలోల బియ్యం అందజేశారు. సభ్యులు సాయికృష్ణ, నరేశ్, దేవేందర్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన గడ్డం శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం బాధిత కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. ఆయన మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అధ్యక్షుడు సోమ భీమారెడ్డి, వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, నాయకులు ఓస రాజేశ్వర్, శాతం గంగారాం, పోశెట్టి, నాగేశ్, సురేశ్, రవి, రజనీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన మహాలక్ష్మి ఆలయ జాతర

- తరలివచ్చిన భక్తజనం
- కుస్తీ పోటీలకు భారీ స్పందన


కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలో రెండు రోజులుగా సాగుతున్న మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం శనివారం ముగిసింది. ఈజాతరకు తెలంగాణతోపాటు మహారాష్ట్రలోని ఆయా ప్రాంతాల భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకొని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. ఆవరణలో ఏర్పాటుచేసిన రంగులరాట్నాలు, గుర్రపుబగ్గీలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి గ్రామంలోని వీధుల్లో అమ్మవారి పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. ఏళ్లుగా సంప్రదాయం కొనసాగిస్తున్నందుకు గ్రామస్తులను అభినందించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం..

జాతరలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలకు స్పందన లభించింది. ప్రథమస్థానంలో నిలిచిన మల్లయోధుడికి బహుమతిగా రూ.7,051, వెండి కడియం, ద్వితీయ స్థానంలో నిలిచిన మల్లయోధుడికి బహుమతిగా రూ.5051, వెండి కడియం అందించారు. అనంతరం విజేతలను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరించండి


రైతులతో మాట్లాడుతున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

- ముధోల్ ఎమ్మెల్యేను కోరిన ఐదు గ్రామాల రైతులు

భైంసాటౌన్: తమ గ్రామాల్లో నెలకొన్న సాగునీటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని లోకేశ్వరం మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌ను కోరారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో అబ్దుల్లాపూర్, జోర్‌పూర్, వటోలి, ధర్మోరా, పంచగుడి గ్రామాల రైతులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలు విన్నవించారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించి పైపులైన్ లీకేజీలతో ఇబ్బంది పడుతున్నామని.. ధర్మోర చెరువుకు లిఫ్ట్ ద్వారా అనుసంధానం చేయాలని కోరారు. పెద్దచెరువు తూముకు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నీటిపారుదల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ముధోల్ నుంచి రూ.30కోట్లతో చేపట్టిన డబుల్ రోడ్డు పనులను పంచగుడి వరకు పొడిగించాలని కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని రైతులు పేర్కొన్నారు. సాగునీటి విషయంలో రాజకీయ పార్టీలకతీతంగా రైతులు ఏకం కావాలని సూచించారు. బీజేపీ లోకేశ్వరం మండలాధ్యక్షుడు సాయన్న, మాజీ ఎంపీపీ మంద లింగన్న, రైతులు తదితరులున్నారు.

అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు

- ఎఫ్ఆర్‌వో రామకృష్ణారావు


అడెల్లి అటవీ ప్రాంతంలో హద్దురాళ్లను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌వో రామకృష్ణారావు

సారంగపూర్: అటవీ భూములను ఆక్రమించి పంటలు సాగుచేస్తే చర్యలు తప్పవని ఎఫ్ఆర్‌వో రామకృష్ణారావు హెచ్చరించారు. మండలంలోని అడెల్లి అటవీ ప్రాంతంలో రిజర్వు ఫారెస్ట్ భూముల హద్దులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అటవీ భూముల పరిరక్షణ బాధ్యత అధికారులతోపాటు ప్రజలపైనా ఉందన్నారు. అడెల్లి రిజర్వుఫారెస్ట్ చుట్టూ భూముల కొలతలు గతంలోనే చేపట్టి హద్దురాళ్లు ఏర్పాటు చేశామన్నారు. అయినా పలుచోట్ల రైతులు హద్దురాళ్లను పెరికివేసి అటవీ భూమిని తమ భూముల్లో కలుపుకొంటున్నారని తెలిపారు. ఇలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అటవీ భూములను ఎప్పటికప్పుడు పరిరక్షించాలని డీఆర్వో నజీర్ ఖాన్‌కు సూచించారు. ఎఫ్‌బీవో స్వప్న, పలువురు సిబ్బంది ఉన్నారు.

మర్రిచెట్టు వద్దకు ఆదివాసీలు

ఖానాపూర్: పెంబి మండలం కోసగుట్ట గ్రామ ఆదివాసీలు శనివారం కాలినడకన ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ గ్రామ మర్రి చెట్టు వద్దకు తరలివచ్చారు. ఆనవాయితీ ప్రకారం ఈసారి కూడా మర్రి చెట్టు వద్దకు చేరుకున్న ఆదివాసీలు రాత్రి బస చేసి ఆదివారం ఉదయం ఖానాపూర్ గోదావరి తీరంలో భీమన్న మడుగుకు వెళ్తారు. భీమన్న దేవుని గజాలకు గంగాజలంతో అభిషేకం చేయించి.. రాత్రికి మర్రి చెట్టు కింద జాగరణ చేసి సోమవారం కోసగుట్టకు వెళ్తారు. తర్వాత కోసగుట్టలో భీమన్న దేవుని ఉత్సవాలు నిర్వహిస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు.

'అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి'


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

కుభీర్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్లలో రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. గతేడాది ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్నవారిలో కేవలం 20శాతం మంది పేర్లు మాత్రమే సర్వేలో వచ్చాయని పేర్కొన్నారు. అధికారులు ఆ వివరాలనే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని తహసీల్దార్‌కు వివరించారు. మిగిలిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మండలాధ్యక్షుడు ఎ.దత్తాత్రి, నాయకులు గంగాశేఖర్, జి.సంతోష్, లింగన్న, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

సంఘం ఏర్పాటు చేసుకోవాలి

ముధోల్: రైతుల సమస్యల పరిష్కరించుకునేందుకు సంఘం ఏర్పాటు చేసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి అంబిర్ ఆనంద్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన రైతు చైతన్య కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులున్నారు.

బ్యాంకుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి


ఎస్‌బీఐలో పరిశీలిస్తున్న సీఐ గోపినాథ్

భైంసాటౌన్: బ్యాంకులు, గోల్డ్‌లోన్ సంస్థల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని పట్టణ సీఐ గోపినాథ్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు బ్యాంకులు, గోల్డ్‌లోన్ ఫైనాన్స్ సంస్థల కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా బ్యాంకు, ఖాతాదారుల రక్షణ కోసం భద్రత వ్యవస్థలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నేరాలు, మోసాల నియంత్రణకు బ్యాంకుల ప్రధాన ద్వారాలు, వెనుక ప్రవేశాలు, అత్యవసర మార్గాలు, తాళాలు, అలారంల పనితీరు పరిశీలించినట్లు పేర్కొన్నారు. అనంతరం సీసీ కెమెరాల నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి


మాట్లాడుతున్న డీఐఈవో రమేశ్

కుభీర్: ఇంటర్ విద్యార్థులు పరీక్షల వేళ ప్రశాంతంగా ఉంటూ ప్రణాళికతో చదువుకోవాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి (డీఐఈవో) రమేశ్ అన్నారు. శనివారం కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పరిశీలించి పలు సూచనలు చేశారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రిన్సిపాల్ సునీల్, అధ్యాపకులు సంపత్, రమేశ్, నర్సయ్య, శ్రీనివాస్, శివరాజ్, మహేశ్, హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి శనివారం నిర్వహించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకోజి కిషన్, భూషణ్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఐబీ చౌరస్తాలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొండాజీ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.